


పాలేరు సమావేశంలో మాట్లాడుతున్న పొంగిలేటి


# వామిక

The Voice Of People

ఆదివారం 28 ఏప్రిల్ 2024 పేజీలు: 4 సంచిక: 122


# స్పీడు పెంచిన కాంగ్రెస్!

- రఘురాం రెడ్డిని గెలిపించండి!
- కార్యకర్తలకు ఖమ్మం మంత్రుల పిలుపు
- పాలేరు సమావేశానికి హాజరైన మాజీ మంత్రి సంభాని
- పాలేరు, ఖమ్మం నియోజకవర్గ స్థాయి సమావేశం
- పాల్గొన్న మంత్రులు పొంగులేటి, తుమ్మల



**ఖమ్మం,ఏప్రిల్27(వామిక,ప్రతినిధి):** లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మతోన్మాద బీజేపీ సర్కారును గద్దెదించుదాం అని పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ఎస్ఆర్ గార్డెన్స్ లో ఖమ్మం, టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్ లో పాలేరు నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశాల్లో మంత్రులు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో 50 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించారని, ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటామని..లోక్‌సభ ఎన్నికల్లో రఘు రాం రెడ్డిని ఇంతకు నాలుగు రెట్ల మెజారిటీతో పట్టం కట్టాలని అన్నారు. నేటి మా పదవులు ప్రజల చలువ అని అన్నారు. అధికార మథం, అహంకారం తో విర్రవీగిన బీఆర్ఎస్ పాలకులకు ఓటర్లు చెంప చెల్లుమనిపించారని, ఈ ఎన్నికల్లో కూడా మళ్ళీ ఇదే జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన సోనియమ్మ కోసమైనా రాష్ట్రంలోని అన్ని ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని కోరారు. పాలేరు సమావేశానికి మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ హాజరవగా.. లోక్ సభ అభ్యర్థి రఘురాం రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ విజయానికి ముమ్మర కృషి చేస్తానని సంభానీ ప్రకటించారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావేద్, కాంగ్రెస్ ఖమ్మం రూరల్ మండలాధ్యక్షులు క్లెశం వెంకట రెడ్డిల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువాళ్ళ దుర్గాప్రసాద్, పీసీసీ నుంచి పాలేరు నియోజకవర్గ పరిశీలకులు అశోక్ గౌడ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, సీనియర్ నాయకులు మద్దినేని స్వర్ణ ఐకుమారి, మద్ది శ్రీనివాస రెడ్డి, రామ సహాయం నరేష్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నల్లమల వెంకటేశ్వర రావు, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, ఎంపీపీ వజ్జా రమ్య, మంగీలాల్, పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, సీపీఐ నాయకులు దండి సురేష్, మహ్మద్ మౌలానా, సలాం, జానీ మియా, సీపీఎం నాయకులు యర్రా శ్రీకాంత్, విక్రమ్, జబ్బార్, నవీన్ రెడ్డి, అధిక సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కెసిఆర్ కరెంట్ కోతలు ఉత్తిదే: సిఎం రేవంత్

- ట్వీట్‌పై సిఎం రేవంత్ స్పందన
- విచారణకు ఆదేశించడంతో బయటపడ్డ నిజాలు
- ఎక్కడా కోతలు లేవని తేల్చిన విద్యుత్ అధికారులు

**హైదరాబాద్,ఏప్రిల్27(వామిక,ప్రతినిధి):** కెసిఆర్ కరెంట్ కోతలపై చేసిన ట్వీట్ ఉత్తిదే అని తేలిపోయింది. కెటిఆర్ ట్వీట్‌పై స్పందించిన సిఎం రేవంత్ ఆదేశాలతో విద్యుత్ అధికారులు రికార్డులు తనిఖీలు చేశారు. మహబూబ్‌నగర్‌లో మాజీమంత్రి శ్రీనివాసరెడ్డి ఇంటివద్ద ఎలాంటి కట్స్ లేకుండా విద్యుత్ సరఫరా అయినట్లు రికార్డుల్లో తేలింది. తెలంగాణలో పవర్ కట్స్ అంటూ బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ చేసిన ట్వీట్.రాజకీయదుమారం రేపింది. నిన్న మహబూబ్ నగర్ లోని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో భోజనం చేస్తున్నప్పుడు రెండుసార్లు కరెంట్ పోయిందని ట్విట్టర్ లో కేసీఆర్ చెప్పారు. రోజుకు పదిసార్లు కరెంట్ పోతుందని తనతో ఎమ్మెల్యేలు చెప్పినట్లు చెప్పారు. రాష్ట్రంలో చాలా విచిత్రమైన ఘటనలు జరుగుతున్నాయని కేసీఆర్ అన్నారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ వైఫల్యానికి ఇంతకన్నా గొప్ప నిదర్శనం ఏముంటుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు, మేధావులు ఆలోచించాలని ట్వీట్ చేశారు కేసీఆర్.అయితే కేసీఆర్ ట్వీట్ పై స్పందించారు సీఎం రేవంత్ రెడ్డి. విచారణకు వెంటనే ఆదేశించారు. దీనిపై విచారణ చేపట్టిన మహబూబ్ నగర్ విద్యుత్ అధికారులు.. ఎలాంటి పవర్ కట్స్ లేవని తేల్చి చెప్పారు. శ్రీనివాస్ గౌడ్ నివాసముంటున్న ప్రాంతంలో చెక్ చేశామని.. విద్యుత్ సబ్ స్టేషన్లో కూడా రికార్డులను చెక్ చేశామన్నారు. ఎలాంటి పవర్



కట్స్ లేవని విద్యుత్ అధికారులు స్పష్టం చేశారు. లేనిపోని అబద్దాలతో కేసీఆర్ దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ మండిపడ్డారు. మొన్న సూర్యాపేటలో కరెంట్ పోయిందని అబద్ధం చెప్పారు. ఇవ్వాళ మహబూబ్‌నగర్‌లోనూ ఇప్పుడు అవే అబద్దాలు చెప్పారని ఫైరయ్యారు. కేసీఆర్‌కు మరీ ఇంత అధికార దాహం ఎందుకని ప్రశ్నించారు. ఓడిన తర్వాత కూడా ఆయనకు ఇంకా గర్వం తగ్గలేదన్నారు.

# దోపిడీ...దోస్త్

**హైదరాబాద్,ఏప్రిల్27**

**(వామిక,ప్రతినిధి):** ఇంటర్మీడియట్ ఫలితాలు ఇటీవలే వెలువడిన నేపథ్యంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరికలు ప్రారంభం కానున్నాయి. డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు నిర్వహిస్తున్న డిగ్రీ ఆన్లైన్ సర్వీసెస్ (దోస్త్) నోటిఫికేషన్ త్వరలోనే వెలువడనుంది. రాష్ట్రవ్యాప్తంగా 8 యూనివర్సిటీల పరిధిలో 153 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు,944 ప్రైవేటు డిగ్రీ కళాశాలలు మొత్తం 1,097 డిగ్రీ కళాశాలలు ఉండగా, ఆయా కళాశాలల్లో 521 డిగ్రీ కోర్సులలో 4.49 లక్షల సీట్లు ఉన్నాయి, 425 సర్టిఫికేట్ కోర్సులున్నాయి.

## ఫీజుల మోత....

డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థుల నుండి దోస్త్ ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తోంది. రిజిస్ట్రేషన్ ఫీజుల పేరుతో మూడు దఫాలుగా ఫీజులు వసూలు చేస్తోంది. మొదటి దఫా రిజిస్ట్రేషన్ ఫీజు 200, రెండవ దఫా 400, మూడవ దఫా 400 గా తీసుకుంటున్నారు. ఒక్క ఫేజ్ లో రిజిస్టర్ అయిన విద్యార్థి ఆయా పేజ్ కు సంబంధింత రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అదే విద్యార్థి తిరిగి తన కళాశాల మార్చుకునేందుకు మరో ఫేజ్ కు వెళ్లాలంటే తిరిగి మళ్లీ ఫీజు చెల్లించాల్సిందే, ఇదే రీతిలో మళ్ళీ,మళ్ళీ వేలాది మంది విద్యార్థుల నుండి ఫీజులు సమీకరిస్తోంది. తమ కళాశాలలో చేరితే విద్యార్థికి అన్ని రకాల ఫీజులు చెల్లిస్తామని హామీ ఇస్తున్న ప్రైవేటు కళాశాలలు గ్రూపు మార్పుల సందర్భంగా తిరిగి, తిరిగి ఫీజులు చెల్లించాల్సి రావడంతో అటు విద్యార్థులు, యాజమాన్యాలు లబోదిబోమంటున్నారు.

## డిపాజిట్లు తిరిగి చెల్లించడం లేదు....

విద్యార్థులు మొదటి సంవత్సరంలో చేరిక సందర్భంగా టీసి,కుల,ఆదాయ ధృవీకరణ పత్రాలు లేనివారి నుండి సుమారు 500 రూపాయలకు పైగా వసూళ్లు చేసి, సర్టిఫికెట్లు ఇచ్చాక తిరిగి రీఫండ్ చేస్తామని హామీ ఇచ్చి, తిరిగి విద్యార్థి సర్టిఫికెట్స్ ఇచ్చాక రీఫండ్ చేయడంలేదు. ఓ పక్క దోస్త్ కన్వీనర్ కళాశాలల ప్రిన్సిపాళ్ళకు పంపిస్తున్నామని చెబుతున్నా కళాశాలలు విద్యార్థులకు చెల్లించడంలేదు. దీనితో దోస్త్ నిర్వహణ,ఖచ్చితత్వం, ఆర్థిక లావాదేవీలపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి.... ఇప్పటికే దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియ కళాశాలల్లో విద్యార్థులు చేరేందుకు సెల్ ఫోన్ ఆధారిత ఓటీపి విధానంతో ప్రైవేటు కళాశాలలు విద్యార్థులను ఓటీపీలతో మోగిస్తున్నాయి.

## విద్యార్థుల ఫీజులు చెల్లించని ప్రిన్సిపాళ్ళపై చర్యలు తీసుకోవాలి,

**బి.వీరభద్రం, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి**

దోస్త్ ప్రతీ యేటా విద్యార్థుల నుండి రీఫండ్ చేస్తామని హామీ ఇచ్చి వసూళ్లు చేస్తున్న ఫీజులు తిరిగి విద్యార్థులకు చెల్లించకపోతే కళాశాలల ప్రిన్సిపాల్స్ మరియు దోస్త్ కన్వీనర్ పై తగు చర్యలు తీసుకోవాలి, రీఫండ్ మరింత పారదర్శకంగా ఉండాలి. ఇదే రీతిలో జరిగితే దోస్త్ అడ్మిషన్ల నిర్వహణ పట్ల విద్యార్థులలో విశ్వసనీయత మందగిస్తుంది, కళాశాలలకు ఫీజుల రీఫండ్ పట్ల సరైన మార్గదర్శకత్వం చేయకపోతే విద్యార్థులకు చెందిన లక్షల రూపాయలు దుర్వినియోగం అవుతాయి.

---

# ప్రజల గొంతుకగా మాట్లాడుతూనే ఉంటాం: కెటిఆర్

■ ప్రజల గొంతుకగా మాట్లాడుతూనే ఉంటాం ■ భవిష్యత్తులోనూ ప్రజల కోసం కొట్లాడుతాం

**హైదరాబాద్,ఏప్రిల్27**

**(వామిక,ప్రతినిధి):** విజయాలకు పొంగిపోము, అపజయాలకు కృంగిపోమనేలా తమ ప్రస్థానం సాగుతుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. భవిష్యత్తులోనూ ప్రజల కోసం మాట్లాడుతూనే ఉంటాం.. కొట్లాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. తెలంగాణకు ఒక గొంతుక ఉండటం అవసరమని, తెలంగాణకంటూ ఉన్న ఒక ఇంటి పార్టీ బీఆర్ఎస్ అని వెల్లడించారు. తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామరక్ష అన్న జయశంకర్ సార్ మాటలు ఎప్పటికీ వాస్తవంగా నిలుస్తాయన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. 2001లో ఉన్న శూన్యం లాంటి వాతావరణంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం బీఆర్ఎస్‌ను కేసీఆర్ ఏర్పాటు చేశారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ నడిపిన తెలంగాణ ఉద్యమం దేశంలోని అనేక రాష్ట్రాలకు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రజాస్వామిక ఉద్యమాలకు ఒక దిక్సూచిగా, ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ జెండాను కేటీఆర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల సహకారంతోనే రాష్ట్రం సహకారమయిందని, పార్టీ తరఫున ఏమిచ్చినా వారి రుణం తీర్చుకోలేమన్నారు. సమైక్యవాద శక్తుల కుట్రలను ఛేదించి తెలంగాణ ప్రజల గొంతుకను అన్ని చట్టసభల్లో టీఆర్ఎస్



(బీఆర్ఎస్) వినిపించిందని చెప్పారు. సాధించుకున్న తెలంగాణకు సరైన నాయకత్వం కేసీఆర్‌దే అని 2014లో తమ పార్టీకి ప్రజలు అవకాశం ఇచ్చారని చెప్పారు. తొమ్మిదిన్నర సంవత్సరాల పరిపాలనలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు, అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేశామని వెల్లడించారు. తెలంగాణలో సాధించిన ప్రగతిని ఇతర ప్రాంతాలకు విస్తరించాలన్న ఒక సదుద్దేశంతో పార్టీ పేరును భారత రాష్ట్ర సమితిగా మార్చి జాతీయ పార్టీగా రూపాంతరం చెందిందని తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఒరిస్సా వంటి రాష్ట్రాల్లో బీఆర్ఎస్‌కు అద్భుతమైన స్పందన లభించిందని వెల్లడించారు. అయితే దురదృష్టవశాత్తు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అనుకూల ఫలితాలు రాలేదని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తలపెట్టిన ఏ పనినైనా వదలకుండా ముందుకు తీసుకుపోయిన చరిత్ర గత రెండున్నర దశాబ్దాలలో ప్రజలందరికీ తెలుసన్నారు. బోధించు, సమీకరించి, పోరాడు అనే అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ఒంటపట్టించుకుని ముందుకు నడుస్తున్న పార్టీ బీఆర్ఎస్ అని వెల్లడించారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలందరికీ, తమకు మద్దతుగా నిలబడిన తెలంగాణ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజల కోసం, వారి ఆకాంక్షల కోసం పోరాడిన గులాబీ దండుకు, ప్రాణాలు అర్పించి తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన వందలాదిమంది తెలంగాణ అమరవీరులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజలందరికీ రుణపడి ఉంటామని, కేసీఆర్ చూపిస్తున్న బాటలో మరోసారి పూనరంకితం అవుతామని స్పష్టం చేశారు.

